https://trinetnews.com/
# ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
తాజా తెలుగు వార్తలు
ప్రతి 3 గంటలకు
9849767747 | 9494184136
7 AM TO 10 AM
సంపుటి: 01 / సంచిక:23 / పేజీలు :02 / వెల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / మంగళవారం, సెప్టెంబర్ 07,2026

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్‌పై కేటీఆర్ ఫైర్..
# అది కోర్టు ధిక్కరణే!

- ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి అరెస్ట్‌ను ఖండించిన కేటీఆర్
- అక్రమ కేసులతో కాంగ్రెస్ కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఆరోపణ
- 420 హామీలు నెరవేరిస్తే తామే స్వచ్ఛందంగా అరెస్ట్ అవుతామని సవాల్
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిల అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు (కేటీఆర్) తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తోందని ఆయన మండిపడ్డారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో బుధవారం ఉదయం ఈ అరెస్టులు జరిగాయి.ఈ సందర్భంగా కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రజాప్రతినిధులను శాసనసభకు వెళ్లకుండా ఆపవద్దని హైకోర్టు స్పష్టంగా ఆదేశించినా, ప్రభుత్వం వాటిని పెడచెవిన పెట్టిందని విమర్శించారు. అక్రమ కేసులు నమోదు చేస్తూ అరెస్టులకు పాల్పడటం కాంగ్రెస్ ప్రభుత్వానికి కోర్టుల పట్ల, చట్టం పట్ల ఉన్న అగౌరవాన్ని సూచిస్తోందని ధ్వజమెత్తారు.

## హైదరాబాద్‌లో హైటెన్షన్
### : ఎమ్మెల్సీ తాతా మధును అరెస్ట్ చేసిన పోలీసులు

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్ట్
మధును వెంటనే మండలి నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం రేవంత్ డిమాండ్
అరెస్ట్ సమయంలో ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద తీవ్ర ఉద్రిక్తత
పోలీసులే తనపై దాడి చేశారని తాతా మధు ఆరోపణ
మరో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ (తాతా మధు)ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నూతన ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఈరోజు ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తాతా మధుతో పాటు మరో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.సోమవారం అసెంబ్లీ గేట్ల వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసులకు మధ్య జరిగిన తోపులాట సందర్భంగా స్పీకర్‌ను ఉద్దేశించి తాతా మధు అనుచిత పదజాలం ఉపయోగించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై వాడిన భాష క్షమించరానిదని, ఇది శాసనసభ గౌరవానికి, తెలంగాణ ఆత్మగౌరవానికి జరిగిన అవమానమని ఆయన పేర్కొన్నారు.



## నిన్నటి అసెంబ్లీ ఘటనలపై ఐదు కేసులు నమోదు..
# కేటీఆర్, హరీశ్‌రావుపైనా కేసులు

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు మొత్తం ఐదు కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలకు దిగారు. ఈ క్రమంలోనే వారిని మంగళవారం ఉదయం అరెస్టు చేసి నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై సెక్షన్ బీఎన్ఎస్ 352, 3(5) రాజ/రూ/రూరూ చట్టంలోని సెక్షన్ 3(1)(తీ), 3(2)(ఝు), 3(2)(జఅఱ) కింద కేసులు నమోదు చేశారు.పోలీసు అధికారులపై దాడి చేసి దూషించారనే ఆరోపణలతో హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపైనా కేసులు నమోదయ్యాయి. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం బాలస్వామి ఫిర్యాదు మేరకు కేటీఆర్, హరీశ్ రావు, సుధీర్ రెడ్డి, గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, శంబీపూర్ రాజు, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, సబితా ఇంద్రారెడ్డి, సంజయ్, విజేయుడు, తాత మధు, నవీన్ కుమార్ రెడ్డి సహా మొత్తం 15 మందిపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.ఇక అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పెట్రోల్ పోసుకుని హంగామా చేశారని ఆప్ కార్యకర్త హేమచంద్రపై, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని బీజేపీ కార్యకర్త గణేశ్‌పై కేసులు పెట్టారు.

## గజ్వేల్‌లో వేడెక్కిన రాజకీయ వాతావరణం..
### కేసీఆర్ నివాసం ముందు భారీగా పోలీసులు!



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

అసెంబ్లీ పరిణామాలపై కేసులతో పాటు రైతు దీక్షకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టుతో గజ్వేల్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఒకవైపు రైతు సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు దీక్షకు సిద్ధమవుతుండగా.. మరోవైపు పార్టీ ముఖ్య నేతల అరెస్టులు, కేసులతో నియోజకవర్గంలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలోనే ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించారు.మార్కుక్ మండలంలో బీఆర్ఎస్ నాయకులు రైతు దీక్ష చేపట్టేందుకు సిద్ధమయ్యారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహించనున్న ఈ దీక్ష నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. దీక్షకు హాజరుకాకుండా పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నేతల అరెస్టులతో గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. రైతుల సమస్యలపై శాంతియుతంగా నిర్వహించనున్న దీక్షను అడ్డుకోవడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. రైతుల సమస్యలపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

### ఎర్రవెల్లిలో భారీ పోలీసు మోహరింపు

మరోవైపు ఎర్రవెల్లిలోని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసం చుట్టూ పోలీసులు భారీగా మోహరించారు. దీంతో ఎర్రవెల్లి పరిసరాల్లోనూ రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు కూడా రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు మొత్తం ఐదు కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్‌రెడ్డిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. మంగళవారం ఉదయం వారిని పోలీసులు అరెస్టు చేసి నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై బీఎన్ఎస్ సెక్షన్ 352, 3(5), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సెక్షన్ 3(1), 3(2), 3(2)కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### హరీశ్‌రావు, కేటీఆర్ సహా పలువురిపై కేసులు

పోలీసు అధికారులపై దాడి చేసి దూషించారనే ఆరోపణలతో బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపైనా కేసులు నమోదయ్యాయి. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పెట్రోల్ పోసుకుని హంగామా చేశారన్న ఆరోపణలతో ఆప్ కార్యకర్త హేమచంద్రపై కేసు పెట్టారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారన్న ఆరోపణలతో బీజేపీ కార్యకర్త గణేశ్‌పై కూడా కేసు నమోదైంది.

## రాక్షస రాజ్యంలో
# రౌడీ జులుం

- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల దమనకాండ
- అరాచక పాలనపై ఆగ్రహజ్వాలలు
- రేవంత్ నిరంకుశత్వంపై అట్టుడికిన సిటీ
- నినాదాలతో దద్దరిల్లిన గన్‌పార్కు,నియోజకవర్గాలలో హోరెత్తిన నిరసనలు
- హక్కులు కాలరాస్తే సహించేదిలేదంటూ.. సర్కార్‌ను హెచ్చరించిన గులాబీ శ్రేణులు
- అమర్యాదగా ప్రవర్తించడంపై అభ్యంతరం
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మల దహనాలు



సిటీబ్యూరో ,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08 :

రాక్షస రాజ్యంలో ప్రజా స్వామ్యం ఖూనీ అయింది.. ప్రశ్నించే గొంతులను నొక్కేసేందుకు కాంగ్రెస్ సర్కార్ రౌడీయిజానికి పాల్పడింది. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్న బీఆర్ఎస్ శాసనసభ్యులపై అసెంబ్లీ వేదికగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేరుగా దౌర్జన్యానికి దిగింది. ఈ నిరంకుశ వైఖరిపై సోమవారం గ్రేటర్‌వ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు ఎగిసిపడ్డాయి. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దమనకాండను ఖండిస్తూ.. చేసిన రణ నినాదాలతో చారిత్రాత్మక గన్ పారు అమరవీరుల స్తూపం, తెలంగాణ భవన్ పరిసర ప్రాంతాలు ప్రతిధ్వనించాయి. సీఎం దిష్టిబొమ్మల దహనాలతో నగరం అట్టుడికింది.'కాంగ్రెస్ రౌడీ రాజ్యం పోవాలి.. కాంగ్రెస్ అరాచకం నశించాలి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' అంటూ బీఆర్ఎస్ శ్రేణులు, మహిళా నాయకులు భారీ ఎత్తున నినాదాలు చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అసెంబ్లీకి వెళ్తున్న మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు రౌడీల్లా వ్యవహరించి అవమానించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. పోలీసుల దాడిలో గాయపడిన ఎమ్మెల్యేలను చికిత్సకు నిమ్స్‌కి వెళ్లేందుకు సైతం అడ్డుకున్న తీరు దారుణమంటూ.. అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ఊరుకునేది లేదని, గుణపాఠం చెబుతామని బీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరించారు.బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండను ఖండిస్తూ.. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. గాజులరామారం, చింతల్, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ 1000 రోజుల దగా పాలనపై అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మహిళా ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.సిటీబ్యూరో, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ ) ప్రభుత్వ అరాచక పాలనకు వ్యతిరేకంగా గ్రేటర్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొకేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అసెంబ్లీలోకి రానివ్వకుండా ప్రభుత్వం చేసిన కుట్రను నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతి నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులు రోడ్లపైకి వచ్చాయి. కర్మన్‌ఘాట్ చౌరస్తాలో బీఆర్ఎస్ పెద్ద శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలిపారు.కంటోన్మెంట్‌లో నియోజకవర్గ ముఖ్యనాయకులు మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, నివేదిక సాయన్న, బోర్డు మాజీ వైస్ చైర్మన్ జక్కుల మహేశ్వర్ రెడ్డి, ఇతర నాయకులు నల్లకండువాలు ధరించి బోర్డు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కుత్బుల్లాపూర్ గండిమైసమ్మ చౌరస్తాలో నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. గాజులరామారం, సికింద్రాబాద్, ఉప్పల్ చౌరస్తాలో స్థానిక నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసీఐఎల్‌లో అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హకును కాలరాస్తూ, అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని, రేవంత్‌రెడ్డి అణచివేత చర్యలకు తగిన గుణపాఠం చెబుతామని బీఆర్ఎస్ శ్రేణులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ప్రజాస్వామ్యం ఖూనీ గొంతు నొక్కితే ఊరుకోం

## గ్రేటర్ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల తీవ్ర ఆగ్రహం

**సిటీబ్యూరో,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08 :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అవుతోందని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఛైర్మన్‌లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వెళ్తున్న ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశపూర్వకంగా అసెంబ్లీ గేటు బయటే పోలీసులతో అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించిందని, కొందరు మహిళా ఎమ్మెల్యేల పట్ల అమర్యాదగా ప్రవర్తించడాన్ని నేతలు తీవ్రంగా ఖండించారు. 'మహిళా సభ్యుల చీరలు లాగడం, జుట్టు పట్టి గుంజడం, గౌరవ సభ్యుల పట్ల వ్యవహరించే విధానం ఇదేనా.. అని ప్రశ్నించారు. ప్రజా సమస్యల నుంచి దారి మళ్లించేందుకే కాంగ్రెస్ సర్కార్ ఇటువంటి అణచివేత చర్యలకు పాల్పడుతోందని నేతలు ఆరోపించారు. శాసనసభ ప్రాంగణంలోకి ప్రజాప్రతినిధులను వెళ్లకుండా అడ్డుకోవడం వారి హకులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.



**ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేదు**

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించే ధైర్యం లేకనే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్ట్ చేయించింది. రాష్ట్రంలో రైతులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. ప్రతిపక్షంగా ప్రజల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలనుకున్న ప్రతిపక్షం గొంతు నొకాలని చూస్తున్నారు. ప్రభుత్వ వైఖరి పట్ల నిరసన తెలిపే ఉద్దేశంతో నల్ల టీ షర్టులు వేసుకోవద్దని పోలీసులు అభ్యంతరం చెప్పడం సరికాదు. ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకోవడానికి ఈ ప్రభుత్వానికి సిగ్గు లేదు.రాజకీయ వార్తలు చదవండి

**-- తలసాని శ్రీనివాస్ యాదవ్,మాజీ మంత్రి**

**నిలదీస్తామనే భయంతోనే కుట్రలకు తెర**

హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామనే భయంతోనే ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు తెరతీసింది. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హకును కూడా కాలరాస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలు, అణచివేత ధోరణిని ప్రజలందరూ నిశితంగా గమనిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఈ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన రీతిలో గుణపాఠం చెప్పడం ఖాయం. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాల గొంతు నొకాలని చూస్తే ఊరుకునేది లేదు. ప్రజల పక్షాన తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం.

**-- పాటిమీది జగన్మోహన్ రావు, మాజీ చైర్మన్ టీఎస్‌టీఎస్**

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడాన్ని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు వ్యవహరించిన తీరు వల్ల నేడు ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రభుత్వ తీరుకు పరాకాష్టగా అభివర్ణించారు.

**రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన**

రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన నడుస్తున్నది. ప్రతిపక్షం ఉన్నదే ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి. వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను అసెంబ్లీలో ప్రజాస్వామికంగా ఎత్తిచూపడం తప్పా. సీనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులతో కొట్టిస్తారా? ఇష్టానుసారంగా తోసివేయడం కాంగ్రెస్ దాష్టీకానికి నిదర్శనం. మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకోవడం, చీర లాగి కంటనీరు పెట్టించడం దుర్మార్గం. ప్రతిపక్షం లేకుండా ఏకపక్షంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని చూస్తున్నారు.ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి, డైవర్ట్ చేయడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కాంగ్రెస్ నేతలు ఆందోళన చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, గ్యారంటీలను అమలు చేస్తే మేం కూడా హర్షిస్తాం. అంతేగానీ ప్రతిపక్షాన్ని అణిచివేస్తామంటే ఊరుకోం. ప్రజలను కూడగట్టి ఉద్యమిస్తాం. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పోతుందా? అని ఎదురు చూస్తున్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ అధోగతి పాలు చేస్తుంది. కాంగ్రెస్ నేతలు చరిత్ర హీనులుగా మిగిలిపోక తప్పదు.

**-- చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే, మేడ్చల్**

**కౌరవ సభను తలపించిన శాసనసభ**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకోవడం కౌరవ సభను తలపిస్తోంది. ప్రజల సమ్మతితో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజల అభీష్టం మేరకు పనిచేయాల్సి ఉండగా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆచరణీయం కాదు. జనాల సమస్యలు పరిష్కరించడం కోసం జరిగే శాసనసభ సమావేశాలకు ఎమ్మెల్యేలను అడ్డుకోవడం వెనుక ప్రభుత్వ కుట్రదాగి ఉంది. అసలు ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకునే అధికారం పోలీసులకు ఎక్కడిది. శాసనసభ, శాసన మండలి సమావేశాలకు హాజరయ్యే ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను పోలీసులు ఎట్టి పరిస్థితిలో అడ్డుకోవద్దని హైకోర్టు స్పష్టం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, పోలీసు డిపార్ట్‌మెంట్‌కు చెంపపెట్టులాంటిది.రాజకీయ వార్తలు చదవండి

**- తీగుళ్ల పద్మారావు గౌడ్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే**

**మహిళా ఎమ్మెల్యేల అరెస్ట్ బాధాకరం : ఎమ్మెల్యే కృష్ణారావు**

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం... ప్రశ్నించిన మహిళా ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం బాధాకరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొని, మహిళా ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ పోలీసుల వాహనానికి అడ్డంగా కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో ప్రజలను మాయమాటలతో కాంగ్రెస్ నేతలు మోసం చేశారని, గద్దెనెక్కాక ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోరాటాలు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను, నేతలను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. బీఆర్ఎస్ నేతలకు పోరాటాలు కొత్తకాదని, నిరంకుశ పాలకులపై పోరాడుతామని, ప్రజలకు న్యాయం జరిగే వరకు ఎన్ని కష్టాలైనా పడతామన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ఇదేం ప్రజాస్వామ్యం?**

మహిళా ఎమ్మెల్యేలని చూడకుండా దుర్మార్గంగా వ్యవహరించారు. అసెంబ్లీ గేటు వద్ద మమ్మల్ని పోలీసులు అడ్డుకొని సభ్యసమాజం తలదించుకునే విధంగా వ్యవహరించారు. సునితా లక్ష్మారెడ్డి చీర లాగారు, నా మెడ పట్టుకొని పోలీసులు లాగేశారు. జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ పోతారా? ఇది ప్రజాస్వామ్యమా? కాంగ్రెస్ వైఫల్యాలను నిలదీస్తారన్న భయంతో పోలీసులను అడ్డుపెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి రాజ్యాంగాన్ని కూనీ చేస్తున్నారు. గతంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదు. నల్ల దుస్తువులు వేసుకొని వస్తే నష్టం ఏమొచ్చింది. రాహుల్ గాంధీ నల్లటీషర్టు వేసుకొని పార్లమెంటుకు పోతే తప్పులేదు. రాహుల్‌గాంధీకి ఒక న్యాయం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు ఒక న్యాయం ఉంటుందా?. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కులేదా, ప్రజల సమస్యలు ప్రస్తావిస్తే పోలీసులతో జులుం చేయిస్తారా, జరిగిన ఘటనపై చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి. సీఎం రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలకు క్షేమాపణ చెప్పాలి.

**-- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**అరాచక పాలనకు తెరలేపారు**

శాసనసభలోకి మమ్మల్ని పోనీయకుండా పోలీసులను అడ్డం పెట్టుకోవడం రాష్ట్రంలో ఏ స్థాయి అరాచక పాలన ఉందో స్పష్టం చేస్తోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా స్పెషల్ టీంలు, గ్రేహౌండ్స్ బలగాలను ఉపయోగించి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మహిళా ప్రజాప్రతినిధులపై భౌతికదారులు చేయించారు. 100 రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలను విస్మరించి, అసెంబ్లీలోనూ బయటా ప్రజలు ప్రశ్నిస్తున్నారనే ఫ్రస్టేషన్‌లోనే ఈ దాడులకు తెగబడ్డారు. మోదీ, ఆదానీ బొమ్మల టీ-షర్టులతో రాహుల్‌గాంధీ పార్లమెంట్‌కు వెళ్లొచ్చు కానీ, ప్రజా సమస్యలపై మేము నల్లరంగు టీ-షర్టులు వేసుకొని అసెంబ్లీకి రాకూడదా? రేవంత్‌రెడ్డి మీరు రాజు, హిట్లర్ కాదు, ఇది ప్రజా సమస్యల వ్యవస్థ అనే విషయాన్ని గుర్తుంచుకోండి. పోలీసుల వెనుక ఉండి మీరు చేయిస్తున్న ఈ అరాచకాలకు త్వరలోనే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు.

**-- కేపీ వివేకానంద్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే**

**ప్రభుత్వతీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం**

అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యేలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేలను అడ్డగించడం దారుణమన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణిచివేయడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కరించకుండా తప్పించుకోవడం సరికాదన్నారు. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రతిపక్షంపై ప్రభుత్వం అణచివేత దోరణి ప్రదర్శిస్తుందని, ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి ప్రజాక్షేత్రంలో శిక్షతప్పదని హెచ్చరించారు.

**-- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

**తెలంగాణలో ప్రజాస్వామ్యం ఉందా?**

ప్రజా సమస్యల మీద పోరాడేందుకు నల్ల టీ షర్టులతో వెళ్తే అరెస్ట్ చేస్తారా, రాహుల్ గాంధీ నల్ల టీ షర్ట్‌తో పార్లమెంట్‌కు వెళ్లలేదా.. కాంగ్రెస్ నాయకులకు ఒక రూల్, తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులకు ఒక రూల్ ఉంటుందా, అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షం లేకుండానే సభను నడుపుతారా.. ఇదేనా మీ ప్రజా పాలన, ఇదెక్కడి దౌర్జన్యం.. ఇది ముమ్మాటికి ఎమర్జెన్సీ పాలనే.

**-- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**నిలదీస్తారనే భయంతోనే అక్రమ అరెస్టులు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, జీవో 22ఏ బాధితుల సమస్యలు, ఇతర ప్రజా సమస్యలపై నిలదీస్తారనే భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైంది. ఆనాడు పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీతో సహా కాంగ్రెస్ నాయకులు నల్ల చొక్కాలు వేసుకొని నిరసన తెలపలేదా? ఇప్పుడు ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపితే అరెస్టు చేయడం ఏమిటి? ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాలకు పరాకాష్ట. ఎన్ని రకాలుగా అడ్డుకున్నా, ఎన్ని అక్రమ అరెస్టులకు పాల్పడినా మా పోరాటం ఆగదు.

**-- శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ**

**ఇది పాపాల భైరవుడి పాలన**

'రేవంత్ నీది ప్రజాపాలన కాదు, పాపాల భైరవుడి పాలన, ప్రజా పక్షాన పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు అసెంబ్లీలోకి వస్తే రేవంత్ పాపాలు ప్రజలకు తెలుస్తాయనే భయంతో పోలీసులను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దౌర్జన్యానికి పాల్పడ్డారు' అని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఈరోజు బ్లాక్ డే అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దురుసుగా, అవమానకరంగా వ్యహరించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా పోలీసులు మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరలాగిన, సబితమ్మ మెడలు నొక్కిన పోలీసులను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమన్నారు. ప్రశ్నించే గొంతుకులపై దౌర్జన్య కాండకు దిగారన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ దుర్మార్గం పరాకాష్టకు చేరిందన్నారు. ప్రభుత్వం గద్దె దిగే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు.రాజకీయ వార్తలు చదవండి

**-జక్క వెంకట్‌రెడ్డి**

**మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం : ఐద్వా**

సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 7: ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ ముందు నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరును అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిల పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించడం సిగ్గుచేటని సోమవారం ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లు లక్ష్మిలు ఓ ప్రకటనలో విమర్శించారు. మాజీ హోంమంత్రిగా బాధ్యతలను నిర్వర్తించిన సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కడం, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగుతూ మహిళా అని చూడకుండా పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. చట్టాన్ని పరిరక్షించాల్సిన రక్షక భటులే మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఈ రకమైన భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఎద్దేవా చేశారు. ఈ ఘటన కేవలం ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి మాత్రమే కాదని, మహిళా లోకానికి జరిగిన తీవ్ర అవమానమని వాపోయారు. ప్రజా ప్రతినిధులకే రక్షణ లేకపోతే ఇక సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల భౌతిక దాడికి పాల్పడి, అసభ్యకరంగా ప్రవర్తించిన పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

**మహిళా సభ్యులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి**

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీలోకి అనుమతించకుండా పోలీసులు దౌర్జన్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. పోలీసుల ప్రవర్తన కాంగ్రెస్ నిరంకుశ పాలనకు నిదర్శనం. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు టీ షర్టులు వేసుకుంటే, వాటిపై స్లోగన్స్ ఉన్నాయని, తమ గొంతు నొక్కాలని చూశారు. బీఆర్ఎస్ వాదనతో ప్రభుత్వం ఇరకాటంతో పడుతుందని భావించే అడ్డుకున్నారు.మా మహిళా నాయకులు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డిలను అడ్డుకుని జుట్టుపట్టి చీరలాగి అవమానించారు. ఈ ఘటనలో కేటీఆర్, హరీశ్‌రావులకు కూడా గాయాలయ్యాయి. సర్కార్ ఆదేశాల మేరకే పోలీసులు తమ ప్రతాపం చూపెట్టారు. అవమానానికి గురైన మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలి. తాతా మధు అనుచిత వాఖ్యలు చేశారని అంటున్నారు. ఈ విషయంలో తాతా మధు తాను విచారం వ్యక్తం చేస్తున్నానని మీడియా ముఖంగానే చెప్పారు. అదే రీతిలో మహిళా ఎమ్మెల్యేలకు కూడా ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి.

**నల్ల షర్ట్‌తో వస్తే అరెస్ట్ చేస్తారా?**

**గూడెం మహిపాల్‌రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే**

నల్ల షర్ట్ ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వస్తే అడ్డుకొని అరెస్టు చేయడం దుర్మార్గం. ప్రజాస్వామ్య పద్ధతిలో నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్తుంటే అడ్డుకోవడం ఏంటి? బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధం. నల్లదుస్తులు ధరించడం కూడా నేరంగా భావించి ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సరికాదు.ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తున్నది. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులను ఇలా అడ్డుకోవడం దుర్మార్గం. ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది.రాజకీయ వార్తలు చదవండి

---

## ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించిన బిఆర్ఎస్ నాయకులు

**ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు08:**

బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు, మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డిని హైదరాబాద్ వనస్థలిపురంలోని వారి నివాసంలో ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు.





## వైద్యులపై దాడి చేస్తే వెంటనే అరెస్టు..

### సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08**

మహారాష్ట్రలో వైద్యులు, దవాఖాన సిబ్బందిపై రాజకీయ నాయకుల దాడి ఘటనలపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం ప్రకటించింది. ఇటువంటి కేసులను తేలికగా పరిగణించలేమని, ఇందులో ప్రమేయం ఉన్నవారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని, వారిని స్వేచ్ఛగా తిరగనివ్వకూడదని సుప్రీంకోర్టు పేర్కొంది. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ఆదివారం ఒక దవాఖానలో శివసేన కార్యకర్తలు ఒక రిసెప్షనిస్ట్‌ను చెంపదెబ్బ కొట్టి, ఒక మహిళా ఉద్యోగిని బెదిరించినట్లు ఆరోపణలు వచ్చిన ఘటన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.థాణెలోని డోంబివ్‌లిలో ఉన్న కేడీఎంసీ శాస్త్రీనగర్ దవాఖానలో వైద్యులు, సిబ్బందిపై దాడి చేశారన్న ఆరోపణలతో జూలై 6న అరెస్టయిన శివసేన కార్పొరేటర్ రమేశ్ సుక్రియ మాత్రే దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అటువంటి రాజకీయ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని, స్వేచ్ఛగా తిరగనివ్వకూడదని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే, బాంబే హైకోర్టు తనకు బెయిల్ మంజూరు చేస్తూ విధించిన కఠినమైన షరతులను సవాలు చేస్తూ మాత్రే సుప్రీంకోర్టును ఆశ్రయించారు.ఆ షరతులలో ఆయన మహారాష్ట్రలో నివసించకూడదనే ఆదేశం కూడా ఉంది. ఆయన ముంబైని సందర్శించడానికి అనుమతి కోరారు. కాగా, సోమవారం నాటి విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో మాత్రే తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి అప్పీలును ఉపసంహరించుకుంటామని కోర్టుకు తెలిపారు. వైద్యులపై దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నది అని రోహత్గీతో జస్టిస్ విక్రమ్ నాథ్ అన్నారు.మీడియాలో వచ్చిన పాల్ఘర్ ఘటనను కూడా ధర్మాసనం ప్రస్తావించింది. నేను నా అప్పీల్‌ను ఉపసంహరించుకోవాలని భావిస్తున్నాను. 10 రోజుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. నిందితునికి త్వరలోనే శిక్ష పడుతుంది అని రోహత్గి ధర్మాసనానికి తెలిపారు. అతనికి శిక్ష పడనివ్వండి. మాకు దానితో సంబంధం లేదు. కాని ఒక సందేశం సమాజానికి వెళ్లాలి అని ధర్మాసనం స్పష్టం చేసింది. మాత్రేకు బెయిల్ మంజూరు చేస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను విచారిస్తామని కూడా సుప్రీంకోర్టు సూచించింది.